సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 2 । అక్టోబర్ । 2025



పండుగ శోభ



శ్రీకాకుళం కాకివీధిలో ముత్యాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో మహిషాసుర మర్దిని ప్రదర్శన చేస్తున్న కళాకారిణి కూన శ్రీలత



ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద దీపాలంకరణ సేవ



శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్లో అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

అక్కడ అలా.. దసరా ఇలా అయితే ఎలా..



కోల్‌కతాలో దసరా వేడుకలు

- ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా దసరా వేడుకలు
- దాండియా నుంచి అలంకరణల వరకు అంతా ప్రత్యేకమే
- శ్రీకాకుళంలోనూ కొనసాగుతున్న వివిధ రాష్ట్రాల సంప్రదాయాలు

శ్రీకాకుళం కల్చరల్:

దసరా అంటేనే సందడి. నవరాత్రులూ ఆనందోత్సాహాలతో అమ్మవారిని కొలుస్తూ ఎంతో వైభవంగా ఉత్సవాలను జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా విభిన్న రీతిలో వేడుకలు నిర్వహిస్తుంటారు. మన జిల్లాలోనూ విభిన్న రాష్ట్రాలకు చెందిన వారు వృత్తి వ్యాపారాల రీత్యా దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. వారంతా తమ రాష్ట్ర సంప్రదాయాలనే ఇక్కడ కొనసాగిస్తూ వేడుకలు జరుపుకుంటున్నారు.



రాజస్థాన్: ఇక్కడ దాండియా నృత్యాలకు ప్రాధాన్యమిస్తారు. నవరాత్రులూ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సందడిగా నృత్యాలు చేస్తూ దేవిని పూజిస్తారు.



కేరళ: మనం దుర్గామాతను పూజిస్తే అక్కడ సరస్వతీ మాతకు పూజలు చేస్తారు. ఎటువంటి జంతు బలులు ఉండవు. రోజుకొక అవతారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.



మహారాష్ట్ర: ఇక్కడ 10 రోజులు పండుగ జరుపుతారు. ప్రతిరోజు ఉపవాసంఉంటారు. రాత్రంతా రామాయణం, రామలీలాపై నృత్యాలు చేస్తుంటారు. ఆఖరి రోజున రావణాసురుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టిబొమ్మలను దహనం చేస్తారు.



ఒడిశా: బరంపురంలో సుమారు 200 మండపాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంటా నిష్టగా పూజలు జరుగుతాయి. చిత్రవిచిత్ర బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని తిలకించేందుకు జనం తండోపతండాలుగా వస్తుంటారు.

అక్షరాభ్యాసాలు



దసరా సమయంలో కేరళ రాష్ట్రంలో కేవలం సరస్వతీ దేవినే పూజిస్తారు. ఆయుధ పూజలు కాకుండా చిన్నారులు, పెద్దలు కలిసి చదువుకే ప్రాధాన్యమిస్తూ పూజలు చేస్తారు. పలుచోట్ల అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. మేమూ అదే సంప్రదాయం కొనసాగిస్తున్నాం.

– ఆర్.ఎ.సూర్యనారాయణ, మంజు దంపతులు, శ్రీకాకుళం

ఊరంతా సందడి



ఒడిశాలో ప్రతి వీధిలో పెండాల్స్ ఏర్పాటు చేస్తారు. ఊరంతా సందడిగా ఉంటుంది. అందరి ఇళ్ల బంధువులు, స్నేహితులతో కళకళలాడుతుంటాయి. వీధుల్లో వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మేం కూడా దసరా వేడుకల సంప్రదాయాలు కొనసాగిస్తున్నాం.

– ఎం.ఫతి, రిటైర్డ్ లెక్చరర్, బలగ మెట్టు

బొమ్మల కొలువులు



తమిళనాడులో దసరా వేడుకల్లో సరస్వతీ పూజలు ఎక్కువగా చేస్తుంటారు. దుర్గా, లక్ష్మీ సరస్వతులను కొలుస్తారు. ప్రతి ఇంటా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. వీటిని చూసేందుకు ప్రతిఒక్కరూ ఆసక్తి చూపుతుంటారు. మేం కూడా సరస్వతీ పూజలకే ప్రాధాన్యమిస్తున్నాం.


– సుబ్రహ్మణ్య కదిరేసన్, తమిళనాడు

ఉపవాసాలు తప్పనిసరి..



మహారాష్ట్రంలో దసరా వేడుకలు ముగిసే వరకూ ఉపవాసాలు చేస్తుంటారు. విజయదశమి నాడు రావణాసురుడి బొమ్మలు సుమారు 50 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసి దహనం చేస్తుంటారు. ఈ వేడుకలు తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివస్తుంటారు.

– రాజేంద్ర కర్నాణి, మహారాష్ట్ర



శ్రీకాకుళం కళాకారుడు రాహుల్ పట్నాయక్ నెమలి పింఛంపై వేసిన కనకదుర్గ చిత్రం

జయజయహే మహిషాసురమర్దిని..



శ్రీకాకుళంలో మహిషాసురమర్దినిగా విజయదుర్గ



గాజుల కొల్లివలసలోని సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గేదెల హరికృష్ణ రూపొందించిన దేవీ సైకత శిల్పం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

–పాతపట్నం/ ఆమదాలవలస/శ్రీకాకుళం కల్చరల్



పాతపట్నంలో మహిషాసురమర్దినిగా నీలమణిదుర్గ



నిరాహార దీక్షలకు దిగిన విద్యుత్ ఉద్యోగులు(ఫైల్)

- కూటమి పాలనలో కానరాని దసరా సరదా
- నిరసనల్లోనే కర్షకులు.. ఉద్యోగులు
- సమస్యలు పట్టించుకోని పాలకులు

అరసవల్లి: కూటమి ప్రభుత్వంలో ఏ వర్గాన్ని చూసినా సంతోషం, సరదాలు కానరావడం లేదు. అన్నం పెట్టిన రైతుల నుంచి వైద్యం అందిస్తున్న డాక్టర్లు, చదువులు చెప్పిన ఉపాధ్యాయులు, వెలుగులిస్తున్న విద్యుత్ సిబ్బంది, ఇంటింటికీ ప్రభుత్వ సేవలందించే సచివాలయ ఉద్యోగులు.. ఇలా ఒకరేంటి కీలకమైన విభాగ శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది అంతా నిరసనల్లోనే ఉన్నారు. నవరాత్రుల అనంతరం దసరా పండగను అన్ని చోట్ల ఆనందోత్సవాల నడుమ జరుపుకుంటారు. జిల్లాలో మాత్రం వివిధ శాఖలకు చెందిన వారికి నిరసనలు, ధర్నాలు, నిరాహార దీక్షలే దసరా సంబరాలు అన్నట్లుగా సర్కార్ నిర్ణయాలు దారితీశాయి. మోసపూరిత ప్రచారాలతో అధికారం దక్కించుకున్న కూటమి నేతలు.. ఇప్పుడు అమలు చేయలేక చేతులెత్తేశారు. అన్ని వర్గాలు నిరసనలు, ధర్నాలకు దిగినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె..

సమస్యల పరిష్కారం చేయాలని సమ్మెకు దిగుతామంటే చర్చలకు పిలిచారు.. తీరా చర్చల్లో డిమాండ్లపై ఒప్పందాలను అంగీకరించి బయటకు వచ్చాక అమలు చేయని విద్యుత్ పంపిణీ సంస్థల యాజమాన్యాలపై, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరసనతో విద్యుత్ సంస్థ ఉద్యోగులు సమ్మెకు దిగారు.

యూరియా దొరక్క రైతులు..



ఎన్నడూ లేనివిధంగా యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. ఒక్క బస్తా కోసం రోజుల తరబడి కార్యాలయాలకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. చెప్పులను క్యూలో ఉంచుకుని మరీ యూరియా కోసం కుస్తీలు పడ్డారు.

బోధనేతర భారంపై గురువులు..



ఉపాధ్యాయులకు పలు రకాల యాప్‌లు, సర్వేలు, పేరెంట్స్ మీటింగ్‌లు, పీ–4 అంటూ చాలా వరకు బోధనేతర పనులు అప్పగించవద్దంటూ ఉపాధ్యాయులు ధర్నాలకు దిగారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని.. ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి, పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలకు దిగారు.

'యాప్'సోపాలు ఎన్నాళ్లంటున్న అంగన్‌వాడీలు..

యాప్‌లతో విపరీతమైన పని ఒత్తిడి.. వైద్య సిబ్బంది పనులను కూడా తమకే అంటగడుతున్నారని అంగన్‌వాడీలు నిరసనలకు దిగారు. 'యాప్'సోపాల నుంచి విముక్తి ఇవ్వాలని కోరుతున్నారు.

సెలవుల కోసం ఆశావర్కర్లు..

365 రోజులూ విధులే.. ఒక్క రోజు కూడా సెలవు ఇవ్వరు.. తమకు సెలవు పెట్టుకునే అర్హత ఇవ్వండంటూ ఆశావర్కర్లు నిరసనలకు దిగారు. 62 ఏళ్ల సర్వీసు నిబంధనతో పాటు క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆవేదనతో సచివాలయ ఉద్యోగులు..



ఉన్నత విద్యార్హతలతో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించినప్పటికీ గత ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన పనులన్నీ తమకు అప్పగించడం, వేధింపులు ఎక్కువ కావడంతో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులంతా నిరసనలకు దిగారు. తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

సకాలంలో జీతాలివ్వాలంటున్న పారిశుద్ధ్య కార్మికులు..

వీధుల్లో చెత్తలను సకాలంలో శుభ్రం చేస్తున్నాం ..కానీ జీతాలు మాత్రం సకాలంలో అందివ్వడం లేదంటూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

పనిఒత్తిడిలో ఇంజినీరింగ్ కాంట్రాక్టు సిబ్బంది..

నగరాభివృద్ధి కోసం కష్టపడుతున్నాం..ఇచ్చిన హామీ మేరకు టెక్నికల్ సిబ్బందికి తగిన జీతాలు ఇవ్వాలి.. పనివేళలు అంటూ చూడకుండా ప్రతి పని సమర్థంగా నిర్వర్తిస్తున్నాం.. మా సమస్యలను పరిష్కరించడంటూ నిరసనలకు దిగారు.

హామీలను నెరవేర్చాలంటున్న వైద్యులు..



టైమ్ బాండ్ ప్రమోషన్లు కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలన్న డిమాండ్లతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెకు దిగారు.

సకలాభరణాలు.. స్వర్ణకిరణాలు

- అరసవల్లిలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం
- ఆదిత్యుని తాకిన లేలేత కిరణాలు
- నేడు కూడా కిరణ స్పర్శకు అవకాశం



స్వామి మూలవిరాట్టును స్పృశిస్తున్న లేలేత సూర్య కిరణాలు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి కొలువుదీరిన అరసవల్లిలో బుధవారం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యోదయ సమయాన సుమారు ఎనిమిది నిమిషాల పాటు గర్భాలయంలోని ఆదిత్యుని మూలవిరాట్టుకు కిరణాభిషేకం జరిగింది. లేలేత తొలి సూర్యకిరణాలు వస్తూనే.. రాజమార్గమంతా ఎర్రని తివాచీలా మారింది. అలా రాజగోపురం నుంచి ఉదయం 5.55 గంటల నుంచి 6.03 గంటల వరకు కిరణాలు స్వామి సన్నిధిలోనే ఉండిపోయాయి. అంతరాలయం మీదుగా గర్భాలయంలోనికి చేరుకున్న కిరణ కాంతులు ముందుగా శ్రీవారి మూలవిరాట్టు పాదాల చెంత ఉన్న రథసారథి అనూరుడిని తాకాయి. దీంతో గర్భాలయమంతా దివ్యకాంతితో మెరిసిపోయింది. తర్వాత క్షణంలో స్వామి వారి ఉదర భాగం, వక్ష భాగాలను తాకుతూ సుమారు 3 నిమిషాలకుపైగా దివ్యముఖ రూపంపైనే కిరణ కాంతి కేంద్రీకృతమయ్యింది. దీంతో భక్తులు పరవశించిపోయారు. మరోవైపు, ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో దర్శనాలు సజావుగా జరిగాయి. గురువారం కూడా వాతావరణం అనుకూలిస్తే కిరణ దర్శనం ఉంటుందని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. కాగా తొలిసారిగా దర్శించుకున్న వారికి మాటలకు అందని అనుభూతి కలగగా...ఇప్పటికే పలుమార్లు వీక్షించిన వారికి ఆనంద పరవశులయ్యారు.

నదులకు వరద ముప్పు



- వంశధారకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఒడిశా–ఉత్తరాంధ్రలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాల వేస్తున్న నేపథ్యంలో జిల్లాలో వంశధార, నాగావళి నదీ పరివాహక ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు బుధవారం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

- గొట్టా బ్యారేజీ వద్ద 3న నది ప్రవాహం ప్రమాద హెచ్చరిక దాటే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరితే శ్రీకాకుళం, గార, కొత్తూరు, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాల్లోని సుమారు 48 గ్రామాలు ప్రభావితమవుతాయని చెప్పారు. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరితే 39 గ్రామాలు ప్రభావితమవుతాయన్నారు.
- నాగావళి పరివాహక ప్రాంతంలో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తోటపల్లి, నారాయణపురం జల వనరుల వద్ద ప్రమాద హెచ్చరిక స్థాయి దాటితే ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల మండలాల్లోని 11 గ్రామాలకు వరద ముప్పు ఉంటుందన్నారు.
- లోతట్టు, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08942-240557) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రేపటి నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

శ్రీకాకుళం: జిల్లా నుంచి డీఎస్సీ–2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈ నెల 3 నుంచి 10 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ రవిబాబు బుధవారం తెలిపారు. తెలుగు, హిందీ, ఒరియా, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు బలగ సమీపంలోని గ్లోబల్ జూనియర్ కాలేజ్.. బయలాజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ అభ్యర్థులు అరసవల్లి సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్.. ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ స్టడీస్ అభ్యర్థులు గొంటివీధిలోని శ్రీమహాలక్ష్మీ నిలయం వద్దకు చేరుకోవాలని కోరారు. ఫిజికల్ సైన్స్, ఎస్జీటీ అభ్యర్థులు మహాలక్ష్మి నగర్ కాలనీలోని విశ్వవిజేత జూనియర్ కాలేజీలో జరిగే శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులపై కూటమిది సవతిప్రేమ

- శాసనసభలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ వ్యాఖ్యలు హాస్యాస్పదం
- ఎమ్మెల్యే అబద్ధాలను ఉద్దానం ప్రజలు గమనిస్తున్నారు
- కవిటి సీహెచ్‌సీ సందర్శనలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ధ్వజం
- ఉదాసీన వైఖరి మార్చుకోకుంటే బాధితుల తరఫున పోరాటానికి సిద్ధం అంటూ హెచ్చరిక



కవిటి సీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ఉద్దానంలోని ఏడు మండలాల పరిధిలో కిడ్నీ బాధితులపై కూటమి ప్రభుత్వం సవతిప్రేమ కనబరుస్తూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ధ్వజమెత్తారు. బుధవారం కవిటి సీహెచ్‌సీ, అక్కడే ఉన్న డయాలసిస్ కేంద్రాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల శాసనసభలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే కిడ్నీబాధితులకు పెన్షన్లు అందించి డయాలసిస్ చేయించామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు డయాలసిస్ పెన్షన్లు, బెడ్లు ఎన్ని ఉండేవో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 2019లో బాధ్యతలు స్వీకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డయాలసిస్ పేషెంట్లకు నెలకు రూ.10,000 పెన్షన్, కాశీబుగ్గలో కిడ్నీవ్యాధుల చికిత్స పరిశోధన కేంద్రం ఏర్పాటు, వంశధార నుంచి ఉపరితల జలాలతో కూడిన రూ.700 కోట్ల తాగునీటి పథకం, సీరం క్రియేటినైన్ ఐదు దాటిన వారికి రూ.5000 పెన్షన్ చెల్లించడం వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఇవన్నీ వదిలేసి ఎమ్మెల్యే అబద్ధాలు చెప్పడం ఉద్దానం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఏడాదిన్నర కూటమి పాలనలో ఉద్దానం కిడ్నీ బాధితులకు చేసిందేంటో చెప్పాలన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం, తాగునీటి పథకాలను నిర్వీర్యం చేయకుండా మెరుగైనా సేవలు అందించాలన్నారు. కవిటి సీహెచ్‌సీలో సిబ్బంది కొరత తీర్చి అదనంగా డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రత్యేక జోన్‌గా ప్రకటించాలి..

కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన కవిటి మండలాన్ని స్పెషల్ జోన్‌గా ప్రకటించి ఇక్కడి వైద్యులకు జీతభత్యాలను పెంచకపోవడం విచారకరమని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల మాదిరిగా కవిటి మండలంలోని డాక్టర్లకు కూడా 50 శాతం అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతం కావడంతో దూరప్రాంతం నుంచి ఎవరూ రావడం లేదన్నారు. కడప, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి వచ్చి కవిటిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు ఇప్పుడు మీమాంసలో పడ్డారని, కొన్నేళ్లుగా కవిటి మండలంలో చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు ఇదేనా అని మదనపడుతున్నారని చెప్పారు. పూర్తిస్థాయిలో నెఫ్రాలజిస్టు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. కవిటిని ప్రత్యేక జోన్‌గా పరిగణిస్తే స్పెషలిస్ట్ డాక్టర్లతో అన్ని సివిల్ అసిస్టెంట్ సర్జన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని, లేనిపక్షంలో మండలంలో వైద్యుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే ఉద్దానం కిడ్నీబాధితుల తరఫున ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమని పిరియా విజయ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ నేతలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, పి.శేఖర్, జె.యుగంధర్, నారాయణ స్వామి, పి.కృష్ణారావు, దుద్ది ధర్మ, ఎం.నాగేశ్వరరావు, ఎం.కృష్ణారావు, బర్ల నాగు, పి.జయరావు, ధనంజయం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

సారవకోట : కిడిమి పంచాయతీ బుడ్డయ్యపేటకు చెందిన పిల్లా పున్నయ్యపై జమచక్రం గ్రామానికి చెందిన మెండ ఆదినారాయణ దాడికి పాల్పడ్డాడు. మంగళవారం మేకల మేత విషయంలో జరిగిన తగాదాలో ఆదినారాయణ తనపై దాడి చేసి గాయపర్చినట్లు పున్నయ్య బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ కృష్ణారావు కేసు నమోదు చేశారు. బాధితుడు ప్రస్తుతం జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వర్శిటీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల : ఉన్నత విద్యా మండలి సూచనల మేరకు 2025 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 3, 4 తేదీల్లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ బి.అడ్డయ్య బుధవారం తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీఎస్టీ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న రెండు రోజుల్లో పరిశ్రమలు, వాణిజ్య పన్నులు, విద్యుత్, చేనేత శాఖల అధికారులు జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జీఎస్టీ నోడల్ అధికారి స్వప్నదేవి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు వర్శిటీ విద్యార్థులు

ఎచ్చెర్ల : కర్ణాటకలోని బెల్గామి వద్ద రాణీ చిన్నమ్మ వర్శిటీలో ఈ నెల 4 నుంచి 7 వరకు జరగనున్న సౌత్ జోన్ అంతర్ వర్శిటీ పురుషుల కబడ్డీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక బీఆర్ఏయూ జట్టు బుధవారం పయమయ్యింది. జట్టుకు కోచ్‌గా ఎం.గణేష్ వ్యవహరించనున్నారు. పోటీల్లో రాణించి విజయం సాధించాలని వ్యాయామ విభాగ అధ్యాపకులు శ్రీనివాసరావు, భాస్కరరావు ఆకాంక్షించారు.

డిమాండ్లు నెరవేర్చాల్సిందే

- ప్రభుత్వానికి స్పష్టం చేసిన పీహెచ్‌సీ వైద్యులు
- జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ

అరసవల్లి:

గ్రామీణ వైద్యుల సమస్యలు, డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం నెరవేర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు గొంతెత్తారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద జిల్లాలోని 71 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సామూహిక ధర్నా నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులకు టైం బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని, జీవో 99 రద్దు చేయాలని.. ఇన్‌సర్వీస్ జీపీ కోటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం గిరిజన భత్యాన్ని అందించాలని, చంద్రన్న సంచార చికిత్సకు రూ.5 వేలు భత్యంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు డాక్టర్ ప్రతిష్ఠా శర్మ, సుధీర్, పావని, సుమప్రియ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పీహెచ్‌సీల్లో 73 మంది వైద్యుల నియామకం

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నేపథ్యంలో ప్రజారోగ్య సేవలకు అంతరాయం లేకుండా ఇతర విభాగాల నుంచి వైద్యులను డిప్యుటేషన్ ప్రాతిపదికను నియమించేలా అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో 73 మంది వైద్యులను పీహెచ్‌సీల్లో ప్రత్యామ్నాయ ప్రాతిపదికన నియామకాలు పూర్తి చేశారు. బుధవారం నుంచే వీరంతా విధుల్లోకి వెళ్లాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. రిమ్స్ (జనరల్ ఆసుపత్రి)లో పనిచేస్తున్న 33 మంది వైద్యులతో పాటు డీసీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా ఆసుపత్రి (టెక్కలి), ఏరియా ఆసుపత్రి (నరసన్నపేట), కమ్యూనిటి ఆసుపత్రులకు చెందిన 40 మంది వైద్యులకు పీహెచ్‌సీల బాధ్యతలు అప్పగించారు. కాగా, సుదూర ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలకు తమను పంపించడంపై పలువురు వైద్యులు మండిపడుతున్నారు.



కొత్తగా నియమితులైన వైద్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

చర్యలు తప్పవు..

ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులంతా సమ్మెలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా 73 మందిని నియమించి డ్యూటి చార్ట్ కేటాయించామని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. వివిధ ప్రోగ్రాంలకు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా ఉన్న మెడికల్ ఆఫీసర్లు ఎవరైనా సమ్మెకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీహెచ్‌సీలు కిటకిట

కొత్తూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మెకు దిగడంతో పేద, సామాన్య రోగులు సీహెచ్‌సీల బాటపడుతున్నారు. కొత్తూరు మండలంలో కురిగాం, మెట్టూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. వైద్యులు సమ్మెలో ఉన్నందున పీహెచ్‌సీలకు వెళ్లవలసిన రోగులు కొత్తూరు సీహెచ్‌సీకి బుధవారం ఎక్కువ మంది వైద్యం కోసం తరలివచ్చారు.



కొత్తూరు సీహెచ్‌సీ ఆవరణలో రోగులు

కార్మికులపై కక్ష సాధింపు తగదు

రణస్థలం: యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో 22 ఎళ్లుగా పని చేస్తున్న కార్మికులను వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో తొలగించడం అన్యాయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సుమారు 50మంది కార్మికులను తొలగించడం దారుణమన్నారు. ఈ విషయమై యూబీ పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే కొద్ది రోజుల్లోనే తిరిగి వేస్తామని చెప్పి నేటికి ఏడాదిన్నర అయినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీజేపీ సానుభూతిపరులైన కార్మికులు మద్యం తాగినా, పరిశ్రమలో గొడవలు సృష్టించినా ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. భూగర్భ జలవరుల శాఖ అధికారుల అనుమతులు లేకుండా 500 అడుగుల లోతున 3 అడుగుల వెడల్పున బోర్లు వేసి జలాలు ఎలా తోడేస్తున్నారని, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని చెప్పారు. కలుషిత వ్యర్థ జలాలు రణస్థలం పంచాయతీలోని సీతంపేట చెరువులోనికి, బంటుపల్లి జగనన్న కాలనీ వైపు వదిలేస్తుండటంతో పంటలకు నష్టం కలుగుతోందన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే బూడిద వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర అనుబంధ విభాగం జాయింట్ సెక్రటరీ కెల్ల రామకృష్ణ, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దన్నాన హరి, బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుందరావు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో సీమేన్ మృతి

నరసన్నపేట: మండలంలోని జమ్ము కూడలి సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబాల రవి (35) మృతి చెందారు. విశాఖ నుంచి తాతయ్య ఊరు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలంలోనే రవి మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న రవి దసరా పండగను కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపేందుకు వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. రవికి భార్య భారతి, తలిదండ్రులు నరసయ్య, కామాక్షమ్మ ఉన్నారు. నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రవి(ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

మెట్ల పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

జలుమూరు: తలతరియా పంచాయతీకి చెందిన దండుపాటి గడ్డయ్య(55) ఇంటి మెట్ల పైనుంచి జారిపడి బుధవారం మృతి చెందాడు. గడ్డయ్య గత నెల 16న ఇంటి నుంచి డాబాపైకి మెట్లు ఎక్కుతూ జారిపడ్డాడు. తల,శరీర భాగాలకు గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు మృతుడి సోదరుడు అప్పయ్య తెలిపారు. గడ్డయ్యకు భార్య యశోద, కుమారుడు రామన్న ఉన్నారు. అప్పయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

జీసీడీఓగా మాధవి

శ్రీకాకుళం : జిల్లా సమగ్ర శిక్షలో సెక్టోరియల్ పోస్టుల్లో ఒకటైన జీసీడీఓగా చదువుల మాధవి నియమితులయ్యారు. మంగళవారం ఉత్తర్వులు వెలువడగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె సారవకోట మండలం పిడిమి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈమె భర్త జల్లేపల్లి శ్రీనివాసరావు గతంలో సమగ్ర శిక్షలో ఏఎస్ఓగా పనిచేశారు. జీసీడీఓ పోస్టు ఆరు నెలలుగా ఖాళీగా ఉంది. కాగా, కొద్దిరోజుల కిందట అసిస్టెంట్ జీసీడీఓగా కాకినాడకు చెందిన రమాదేవిని నియమించారు. జిల్లాల పునర్విభజనలో ఈ పోస్టు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయింది. లేనిపోస్టులో రమాదేవిని నియమించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా జీసీడీఓ నియామకం పూర్తయిన నేపథ్యంలో అసిస్టెంట్ జీసీడీఓని కొనసాగిస్తారా ఆమెను వెనక్కు పంపిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

చోరీ సొత్తు స్వాధీనం

- హిజ్రా అరెస్టు

కంచిలి/పలాస: మండల కేంద్రం కంచిలిలో ఈ ఏడాది జూలై 5న రిటైర్డు లెక్చరర్ పురెళ్ల సింహాద్రి ప్రధాన్ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి కొంత సొత్తును రికవరీ చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపారు. 25 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి ఆభరణాలు చోరీకి గురికాగా 12 తులాల ముప్పావు బంగారు ఆభరణాలు, 55.88 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. చోరీ కేసులో ఐదుగురు నిందితుల్లో ఒకరైన కంచిలిలో రైల్వేస్టేషన్ వెనుకవైపు నివాసం ఉంటున్న కవిటి మండలం కవిటి పట్టణం కంచ్రవీధికి చెందిన నాగుల సోనియా అనే హిజ్రా బుధవారం ఉదయం 11 గంటలకు సోంపేట వైపు నుంచి కంచిలి రైల్వేస్టేషన్ వైపు చేతిలో కవర్ పట్టుకొని వస్తోంది. పోలీసులను చూసి పారిపోతుండగా సోంపేట సీఐ బి.మంగరాజు సిబ్బంది సాయంతో పట్టుకున్నారు. ఈ క్రమంలో జూలై 5న రాత్రి బూరలు అమ్ముకొనే బాబు(భోపాల్, మధ్యప్రదేశ్), కబాడియా(ఔరంగాబాద్, మహారాష్ట్ర), సనాటా(కోట, రాజస్థాన్), టున్ని అనే నలుగురు వ్యక్తులతో కలిసి కంచిలిలోని సింహాద్రి ప్రధాన్ ఇంట్లో దొంగతనం చేసినట్లు అంగీకరించింది. ఆమె వద్ద 105.53 గ్రాములు బంగారు, డైమండ్ లాంగ్ నెక్లెస్(హారం), 41.57 గ్రాముల మామిడి పిందెల బంగారు చైన్, 3.88 గ్రాముల చెవి రింగులు, 55.88గ్రాముల వెండి గిన్నెలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సోంపేట సీఐతో పాటు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు, సోంపేట సీఐ మంగరాజు

బైక్ నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

పాతపట్నం: పెద్దలక్ష్మీపురం పంచాయతీ రామచంద్రపురం కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పాతపట్నం ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. సారవకోట మండల కేంద్రం రెల్లివీధికి చెందిన అడప ఈశ్వరరావు (36) ద్విచక్ర వాహనంపై తెంబూరు నుంచి సారవకోట వెళుతుండగా రామచంద్రపురం కూడలి వద్ద వచ్చేసరికి అదుపుతప్పి బైక్‌పై నుంచి జారిపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ మధుసూదనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈశ్వరరావుకు భార్య సుజాత, కుమారుడు యెషన్ ఉన్నారు. సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



ఈశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

శాసనసభలో అవగాహనతో మాట్లాడాలి

సారవకోట: శాసనసభలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అవగాహన లేకుండా మాట్లాడారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. బుధవారం సారవకోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలని చెప్పుకుంటున్న వారు బీసీ-ఏకి చెందిన వడ్డి కులస్తులని, వారి కోసం గతంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిశోధన సంస్థ అధ్యయనం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని తెలిపారు. అది తెలుసుకోకుండా శాసనసభలో అవగాహన రాహిత్యంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేసి ఓట్లు కోసం నకిలీ బెంతు ఒరియాల కోసం శాసనసభలో మాట్లాడటం విచారకరమన్నారు. జిల్లాలో ఆదివాసీలకు అవసరమైన ఐటీడీఏ లేదని, నకిలీ గిరిజన ధ్రువపత్రాలతో సుమారు వెయ్యి మంది శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగాలు చేస్తున్నారని, వారిపై శాసనసభలో మాట్లాడం లేదన్నారు. ఆయనతో పాటు ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు జన్ని దాలయ్య, బొమ్మాళి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగారావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగి

ఒడిశా ఎస్‌ఐ పరీక్ష పేపర్ లీకేజీ కలకలం

- అభ్యర్థులను ఎచ్చెర్లలో పట్టుకున్న పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

శ్రీకాకుళం క్రైమ్:

ఒడిశా రాష్ట్రంలో కలకలం రేపిన ఎస్‌ఐ ఎగ్జామ్ పేపర్ లీకేజీ ఘటనలో సంబంధిత అభ్యర్థులను శ్రీకాకుళం పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దీనికి సంబంధించిన వివరాలను బుధవారం వెల్లడించారు. ఒడిశా పోలీసు అధికారులు కూడా పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే..

2025 ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఓపీఆర్‌బీ) కొత్తగా సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల ఎగ్జామ్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో భాగంగా కొంతమంది ఏజెంట్లు పేపర్ లీక్ చేసి డబ్బులు దండుకునే పనిలో పడ్డారు. అభ్యర్థుల వద్ద పరీక్షలకు ముందు కొంత మొత్తంలో డబ్బులు తీసుకునేందుకు, ఫలితాలు వెలువడ్డాక మరికొంత మొత్తం తీసుకునేందుకు ముందుగానే ఏజెంట్లు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిసింది. ఒక్కో ఉద్యోగానికి సుమారు రూ.25 లక్షల వరకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఎస్పీకి సమాచారం రావడంతో..

విషయం బరంపురం పోలీసులకు సమాచారం రావడంతో అక్కడి రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశారు. సెప్టెంబర్ 29న (సోమవారం) మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడనున్న అభ్యర్థులు ఏజెంట్లతో మాట్లాడి విజయనగరంలో ఉన్న లీకేజీ పేపర్లు తీసుకోవడానికి బస్సుల్లో బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. వీరంతా ఒడిశా సరిహద్దు దాటాక విషయం తెలియడంతో వెంటనే శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి సమాచారమిచ్చారు. వెంటనే ఎస్పీ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో..

అభ్యర్థులు మూడు బస్సుల్లో వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్పీ శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందకు ఆదేశాలిచ్చారు. దీంతో మడపాం టోల్‌గేట్ వద్ద వారిని పట్టుకునేందుకు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావుతో కూడిన ఓ బృందాన్ని.. అక్కడ తప్పితే జె.ఆర్.పురం(రణస్థలం) పరిధిలో పట్టుకునేందుకు ఆమదాలవలస సీఐ సత్యనారాయణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

మూడు బస్సుల్లో 114 మంది అభ్యర్థులు..

సోమవారం రాత్రి మడపాం దాటేసిన మూడు బస్సులు శ్రీకాకుళం దాటి ఎచ్చెర్ల వచ్చిన వెంటనే పోలీసులు పట్టుకున్నారు. ఒక్కో బస్సులో 42 మంది చొప్పున మొత్తం 126 మంది పాసింజర్లు ఉండగా వీరిలో 114 మంది ఎస్‌ఐ ఎగ్జామ్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారని డీఎస్పీ 'సాక్షి'కి బుధవారం వెల్లడించారు. తక్షణమే వారిని అదుపులోకి తీసుకుని ఒడిశా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి నిందితులను అరెస్టు చేసి కటక్‌కు తరలించారని డీఎస్పీ వివరించారు.

ట్రిపుల్ ఐటీ ఏఓకు పదోన్నతి

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డిప్యూటేషన్‌పై అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కవిటి మోహనరావుకు విశాఖపట్నం ఖజానా, గణాంక శాఖకు జిల్లా అధికారిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన శ్రీకాకుళం క్యాంపస్‌లో రెండేళ్లగా అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో శ్రీకాకుళం నగరానికి చెందిన అభినయ నృత్య నికేతన్ నృత్యదర్శకురాలు డాక్టర్ టి.నీరజా సుబ్రహ్మణ్యం శిష్యబృందం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. లింగాష్టకం, కాలభైరవాష్టకం, మంజునాథ చరితం తదితర కూచిపూడి నృత్య రూపకాలు ప్రదర్శించి ప్రశంసలు పొందారు. – శ్రీకాకుళం కల్చరల్



ఒకటే గమనం.. ఒకటే గమ్యం!

- నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు
- కఠోర సాధన చేస్తున్న క్రీడాకారులు
- ఇప్పిలి, కేశవరావుపేట వేదికగా రెసిడెన్షియల్ శిక్షణా శిబిరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాఫ్ట్‌బాల్ గేమ్‌లో పతకమే లక్ష్యంగా బాలబాలికలు కఠోర సాధన పూర్తి చేశారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో సత్తా చాటేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్, సీనియర్స్ ఇలా అన్ని విభాగాల్లోను హాట్ ఫేవరేట్‌గా బరిలో దిగుతున్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభ్యర్థనను, దసరా సెలవులను పరిగణనలోకి తీసుకున్న జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ పెద్దలు శ్రీకాకుళం రూరల్ మండలం, ఇప్పిలి జెడ్పీహెచ్ స్కూల్ వేదికగా బాలికలకు, ఎచ్చెర్ల మండలం, కేశవరావుపేట జెడ్పీహెచ్‌స్కూల్ వేదికగా బాలురకు శిక్షణా శిబిరాలను నిర్వహించారు. టైటిల్ సాధనే లక్ష్యంగా క్రీడాకారులకు గేమ్‌లో మెలకువలు అందిస్తు తీర్చిదిద్దారు. గేమ్‌తోపాటు ఫిట్‌నెస్‌పై కూడా దృష్టిసారిస్తున్నారు. సంఘ పెద్దలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



కేశవరావుపేటలో సాఫ్ట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు



నెట్స్ వద్ద కఠోర సాధన చేస్తున్న క్రీడాకారిణి

మెలకువలు నేర్చుకున్నాం..

మాణిక్యపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో టెన్త్‌క్లాస్ చదువుతున్నాను. జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. శిక్షణా శిబిరాల్లో మెలకువలు నేర్చుకుంటున్నాం.

– సాహు కాళిదాస్, సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు



సన్నద్ధం చేస్తున్నాం..

క్రీడాకారులకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతోనే రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. సంఘ పెద్దల ప్రోత్సాహంతో సొంత ఖర్చులు పెట్టుకుని, రెసిడెన్షియల్ క్యాంప్‌లు నిర్వహించి పోటీలకు సన్నద్ధం చేస్తున్నాం.

– మొజ్జాడ వెంకటరమణ, ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్

